క్లుప్తంగా

బీసీబంధు ఇవ్వాలని వినతి



వాజేడు: మండల పరిధిలోని పేరూరు గ్రామంలో ఉన్న రజక కులస్తులకు కూడా బీసీబంధు ఇవ్వాలని కోరుతూ సర్పంచ్, కార్యదర్శులకు మంగళవారం వినతిపత్రం అందజేశారు. తెలంగాణ అప్రభుత్వం ఇస్తున్న బీసీబంధుకు దరఖాస్తులను చేసుకున్నప్పటికీ పేరూరులోని 9 రజక కుటుంబాల్లో ఏ ఒక్కరికి బీసీబంధు రాలేదని వాపోయారు. కలెక్టర్ ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించి తమకు న్యాయం చేయాలని కోరారు.

రవాణాశాఖ జిల్లా ఇన్‌చార్జ్ అధికారిగా శ్రీనివాస్



ములుగు: ఇటీవల ఏర్పాటు చేసిన జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో మోటార్ వెహికిల్ ఇన్‌స్పెక్టర్(ఎంవీఐ)గా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ జిల్లా ఇన్‌చార్జ్ రవాణా అధికారిగా అదనపు బాధ్యతలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంగళవారం కలెక్టర్ ఇలా త్రిపాఠిని కలిసి పూల మొక్క అందించారు. విధినిర్వహణ విషయంలో అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.

బాధ్యతల స్వీకరణ



మంగపేట: మండల పరిషత్ నూతన అధికారిగా మమత మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. మంగపేట ఎంపీఓగా విధులు నిర్వహిస్తున్న శ్రీనివాస్ వెంకటాపురం(ఎం) మండలానికి బదిలీ కాగా అక్కడ విధులు నిర్వహిస్తున్న ఎంపీఓ మంతిని మమతను డిప్యుటేషన్‌పై ఇక్కడికి నియమిస్తు కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా విధుల్లో చేరిన ఎంపీఓ మమతకు ఎంపీడీఓ శ్రీధర్, సూపరింటెండెంట్ ఆలేటి సుదర్శన్, సీనియర్ అసిస్టెంట్ నాగేందర్, కార్యాలయ సిబ్బంది స్వాగతం పలికి శుభాకాంక్షలు తెలిపారు.

ఎస్సైగా రామకృష్ణ

ములుగు: ములుగు రెండవ ఎస్సైగా 2020 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణ మంగళవారం విధుల్లో చేరారు. ఇంతకు ముందు భూపాలపల్లిలో అడ్మిన్‌గా ఏటూర్‌నాగారంలో రెండవ ఎస్సైగా పనిచేసి ములుగుకు బదిలీ అయ్యారు. కాగా, సిబ్బంది ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

సన్మానం



ఏటూరునాగారం: మండల కేంద్రానికి చెందిన ఏటూరునాగారం కోచ్, హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు పర్వతాల కుమారస్వామి, ఎం.కరిష్మా (హ్యాండ్‌బాల్), ఎస్. రవీందర్ అథ్లెటిక్స్‌లో ఇటీవల హైదరాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయిక్రీడల్లో గెలుపొందారు. మంగళవారం నేషనల్ స్పోర్ట్స్‌డేను పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో జిల్లా స్పోర్ట్స్ ఆఫీసర్ వెంకయ్య, జెడ్పీ సీఈఓ ప్రసూనరాణి, ఎంపీపీ శ్రీదేవిలు వారిని ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో లావణ్యతో పాటు తదితరులు పాల్గొన్నారు.

కొండ చిలువ హతం

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం గ్రామంలో మంగళవారం గ్రామస్తులు కొండ చిలువను హతమర్చారు. గ్రామానికి చెందిన కుప్ప రామరావు ఇంటి ఆవరణలోకి కొండ సిలువ రావడంతో దానిని చంపారు.

పరామర్శ



వెంకటాపురం(ఎం): మండలంలోని నారాయణగిరిపల్లెకు చెందిన మాజీ ఎంపీపీ ఆశాడపు దేవేందర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడ్డాడు. దీంతో జెడ్పీ చైర్‌పర్సన్ నాగజ్యోతి బాధితుడి ఇంటికి వెళ్లి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బుర్ర రజిత సమ్మయ్య, జెడ్పీటీసీ గై రుద్రమదేవి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు లింగాల రమణారెడ్డి, సర్పంచ్‌లు జగన్‌మోహన్‌రావు, కుమారస్వామి, నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, భద్రయ్య, సమ్మయ్య, అశోక్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

బీసీ బంధు చెక్కుల పంపిణీ



వెంకటాపురం(కె): చెక్కులు అందజేస్తున్న ప్రజా ప్రతినిధులు



వాజేడులో..

వెంకటాపురం(కె): మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో బీసీబంధు చెక్కులను లబ్ధిదారులకు జెడ్పీటీసీ పాయం రమణ, ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్ చేతుల మీదుగా మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా జెడ్పీటీసీ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రభుత్వం బీసీలలో కుల వృత్తిదారులను ప్రోత్సహించేందుకు బీసీ బంధు పేరుతో లక్ష రూపాయలను అందజేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ సయ్యద్‌హుస్సేన్, సర్పంచ్ పూజారి ఆదిలక్ష్మి, చిడెం యామిలి, గంగా, సత్యవతి, పూనెం శ్రీదేవి, అట్టం సత్యనారాయణ, బీసీ వేల్ఫేర్ జిల్లా అధికారి లక్ష్మణ్, ఎంపీడీఓ అడ్డూరి బాబు ఉన్నారు.

వాజేడు: తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన బీసీ బంధు చెక్కులను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ శ్యామల శారద, జెడ్పీటీసీ తల్లడి పుష్పలత అన్నారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మంగళవారం బీసీ బంధు చెక్కులు 60 మందికి రాగా వాటిని లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం బీసీల్లో పేదలను గుర్తించి వారికి బీసీబంధును అందించిందని తెలిపారు. బీసీ కార్పొరేషన్ జిల్లా అధికారి లక్ష్మణ్, ఎంపీడీఓ విజయ, ఎంపీఓ శ్రీకాంత్ నాయుడు ఉన్నారు.

నోట్ పుస్తకాల అందజేత



విద్యార్థులకు నోట్ పుస్తకాలు అందిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ములుగు రూరల్: మండలంలోని పత్తిపల్లి ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ఎమ్మెల్యే సీతక్క నోట్ పుస్తకాలను అందజేశారు. మంగళవారం పత్తిపల్లి గ్రామంలో పర్యటించిన ఆమె నిరుపేద విద్యార్థులకు నోట్ బుక్స్ అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని అన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల మృతి చెందిన పలువురి కుటుంబాలను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు బానోత్ రవిచందర్, కంబాల రవి, మండల అధ్యక్షుడు చాంద్‌పాషా, నల్లెల్ల భరత్, సారయ్య, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

అంగవైకల్యం చదువుకు అడ్డుకాదు



వీల్‌చైర్‌ను అందజేస్తున్న ప్రజాప్రతినిధులు

ఏటూరునాగారం: అంగవైకల్యం చదువుకు అడ్డు కాకూడదని, మనోధైర్యంతో ముందుకు వెళ్లాలని, తల్లిదండ్రులు వారిని ప్రోత్సహించాలని ఎంపీపీ అంతటి విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రంలో దివ్యాంగుల భారత కృత్రిమ అవయవాల నిర్మాణ సంస్థ, సమగ్ర శిక్ష ద్వారా వచ్చిన కృత్రిమ అవయవాలను దివ్యాంగులకు ఎంపీపీ, జెడ్పీ కోఆప్షన్ సభ్యులు అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కొంత మందికి పుట్టుకతోనే అంగవైకల్యం వస్తుందని, కొంత మంది ప్రమాదవశాత్తు అవయవాలను కోల్పోతారన్నారు. విద్యార్థుల్లో అలాంటి లోపాలు ఉంటే వెంటనే భవిత సెంటర్‌ను సంప్రదించి వారికి అందిస్తున్న సేవలను పొందాలన్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు రూ.4016 పింఛన్ ఇస్తోందన్నారు. దివ్యాంగుల తల్లిదండ్రులు ఆత్మస్థైర్యంతో ఉండాలన్నారు. వారి పిల్లల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహిస్తే సాధించనిది ఏదిలేదన్నారు. భవిత సెంటర్‌లో అభ్యసిస్తున్న దివ్యాంగుల విద్యార్థులకు సీపీ చైర్స్, వీల్ చైర్స్, రోలేటర్స్, కాలిఫర్స్, ఆర్టిఫిషెల్ లిమ్స్, ఎంఆర్ కిట్స్ పరికరాలను అందజేశారు.

చీరల పంపిణీ

జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పనిచేస్తున్న మహిళా గ్రూపు సభ్యులకు పాఠశాల ద్వారా చీరలను ఎంపీపీ విజయ, జెడ్పీ కోఆప్షన్ సభ్యురాలు వలియాబీ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ సురేందర్, ఐఈఆర్‌టీలు స్వరూపరాని, రమేష్, సీఆర్‌పీలు శ్రీధర్‌నాయక్, సత్యారావు, కంప్యూటర్ ఆపరేటర్ విజయ్, దివ్యాంగుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

‘ఆరోగ్య మహిళా’ కేంద్రంలో వైద్య పరీక్షలు



వెంకటాపురం(కె): మహిళలతో వైద్యాధికారి భవ్యశ్రీ



ఏటూరునాగారం: ఆరోగ్య మహిళ క్లినిక్ హాజరైన మహిళలు

వెంకటాపురం(కె) మండల కేంద్రంలోని వెంకటాపురం ఆరోగ్య మహిళ కేంద్రంలో మహిళలకు వైద్య పరీక్షలను ఎదిర వైద్యాధికారి భవ్యశ్రీ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా 91 మంది మహిళలకు వైద్య పరీక్షలను నిర్వహించి వారి వద్ద నుంచి రక్త నమూనాలను సేకరించారు. సేకరించిన రక్త నమూనాలను పరీక్షల నిమిత్తం ములుగు ఏరియా వైద్యశాలకు పంపించినట్లు వైద్యాధికారి తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది తదితరులు ఉన్నారు.

ఏటూరునాగారం: ఆరోగ్య మహిళ క్లినిక్ కార్యక్రమాన్ని మహిళలు సద్వినియోగం చేసుకోవాలని రొయ్యూర్ పీహెచ్‌సీ వైద్యురాలు సుమలత అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని ఆకులవారిఘణపురం సబ్ సెంటర్‌లో ఆరోగ్య మహిళా క్లినిక్ నిర్వహించి మహిళలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించారు. అనంతరం వైద్యురాలు మాట్లాడుతూ.. 8 రకాల పరీక్షలు చేసి చికిత్సలు అందిస్తామన్నారు. ప్రతీ మంగళవారం ఈ శిబిరం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ కమల, స్టాఫ్‌నర్సు శ్రీలత, ల్యాబ్ టెక్నీషియన్ శ్రీనివాస్, ఏఎన్ఎంలు గీత, పద్మ, ఝాన్సీ, లక్ష్మి, సులోచన, ఆశ కార్యకర్తలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘కాఫెడ్’ సేవలు అభినందనీయం



నిత్యావసర సరుకులను అందజేస్తున్న సీఐ కుమార్

వెంకటాపురం(కె): ఏజెన్సీ ప్రాంతంలో గిరిజనులు, గిరిజనేతరుల కోసం కాఫెడ్ స్వచ్ఛంద సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని సీఐ బండారి కుమార్, జెడ్పీటీసీ పాయం రమణ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో సంస్థ కార్యాలయం ఆవరణంలో వరద బాధిత కుటుంబాలకు నిత్యావసర సరుకులు, వంట గిన్నెలు, దుస్తులను అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడుతూ.. మూరుమూల ప్రాంతాల్లోని గ్రామాల్లోని ప్రజలకు కావాల్సిన సహాయ సహకారాలు అందించడంతోపాటు, వారికి అండదండగా ఉంటూ కాఫెడ్ స్వచ్ఛంద సంస్థ సేవలను అందిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై అశోక్, ఎంపీపీ చెరుకూరి సతీష్ కుమార్, వెంకటాపురం పీఏసీఎస్ చైర్మన్ చిడెం మోహనరావు, వైస్ ఎంపీపీ సయ్యద్ హుస్సేన్, ఎంపీటీసీలు కొండపర్తి సీతదేవి, సర్పంచ్‌లు పూనెం శ్రీదేవి, అట్టం సత్యవతి, గంగా, క్రిష్టియన్ దాస్, సంస్థ డైరెక్టర్ లూర్దు రాజ్, చిడెం సాంబశివరావు తదితరులు ఉన్నారు.

జాతీయ క్రీడా దినోత్సవం



ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ఉపాధ్యాయులు, క్రీడాకారులు

ములుగు రూరల్: జాతీయ క్రీడా దినోత్సవాన్ని మండల పరిధిలోని జాకారం సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. జాతీయ హాకీ క్రీడాకారుడు ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని జాతీయ క్రీడా దినోత్సవాన్ని మంగళవారం నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ యాదగిరి మాట్లాడుతూ విద్యార్థులు చదువుతో పాటు క్రీడా రంగంలో రాణించాలని సూచించారు. విద్యార్థులకు క్రీడలు మానసికోల్లాసానికి కలిగిస్తాయని తెలిపారు. పాఠశాల తరఫున జాతీయ క్రీడల్లో పాల్గొన్న విద్యార్థులను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ పిచ్చిరెడ్డి, శ్రీధర్‌రావు, పీఈటీ భాస్కర్, అధ్యాపకులు సురేష్‌బాబు, రాంరెడ్డి, సత్యం, బాలకృష్ణ, రామచందర్, రాజ్‌నాయక్, వినోద్ కుమార్, ఆంజనేయులు, మమత, అశోక్, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు.

మేడారంలోని ఆశ్రమ పాఠశాలలో..

ఎస్ఎస్ తాడ్వాయి: మండల పరిధిలోని ఆశ్రమ పాఠశాలలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఉపాధ్యాయులు మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మేజర్ ధ్యాన్ చంద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం జాతీయ స్థాయి క్రీడాకారులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా హెచ్ఎం సరోజన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉండే విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం అధికంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం క్రీడాకారులను ప్రోత్సహిస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు తేజ, కృష్ణ, పీడీ లక్ష్మీనారాయణ, డిప్యూటీ వార్డెన్ అశ్విని, ఉపాధ్యాయులు వెంకటలక్ష్మి, పార్వతి, ఏకాంబరం, జవహర్, యుగంధర్, భాస్కర్, వీరన్న, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ పాఠశాలలో మంగళవారం ధ్యాన్‌చంద్ జయంతి వేడుకలను ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్ర పటానికి స్పెషల్ ఆఫీసర్ మడే అరుణ పూలమాల వేసి నివాళులర్పించారు. అదేవిధంగా స్పోర్ట్స్ డే దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. విద్యార్థులతో ఆట పాట, క్రీడలను నిర్వహించారు. ఉపాధ్యాయులు, పీఈటీ స్వరూప పాల్గొన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



దాడుల్లో పాల్గొన్న పోలీసులు

వెంకటాపురం(కె): గుడుంబా తయారీ, రవాణా లాంటి అసాంఘిక కార్యకలపాలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని వెంకటాపురం సీఐ బండారి కుమార్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని బెస్తగూడెం గ్రామంలో గుడంబా స్థావరాలపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడు వేల లీటర్ల బెల్లం పానకం, 50 లీటర్ల గుడుంబా, వంద కేజీల పటిక, 50 కేజీల పంచదారను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు నలుగురు వ్యక్తులపై కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. ఎస్సై కొప్పుల తిరుపతి రావు, పోలీసులు, సీఆర్‌పీఎఫ్ సిబ్బంది ఉన్నారు.

సైబర్ నేరాలపై అవగాహన



గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎస్సై

వాజేడు: సైబర్ నేరాలు పెరుగుతున్న క్రమంలో ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని వాజేడు ఎస్సై వెంకటేశ్వర్‌రావు అన్నారు. మండల పరిధిలోని మొట్లగూడెం గ్రామంలో మంగళవారం గ్రామస్తులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహించి అవగాహన కల్పించారు. సైబర్ నేరాలతో చాలా ప్రమాదం ఉందని జాగ్రత్తగా ఉండాలన్నారు. గ్రామంలోకి కొత్త వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. అనుమానితులకు ఆశ్రయం కల్పించ వద్దని సూచించారు.

ప్రజల ప్రాణాలను కాపాడటంలో విఫలం



మాట్లాడుతున్న రఘుపతి

వాజేడు: ప్రజల ప్రాణాలను కాపాడటంలో తెలంగాణ ప్రభుత్వం విఫలమైందని సీపీఎం పార్టీ మండల కార్యదర్శి కొప్పుల రఘుపతి ఆరోపించారు. మండల పరిధిలోని ధర్మవరం గ్రామంలో మంగళవారం పార్టీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. వాజేడు మండలంలో విష జ్వరాల బారిన పడి ప్రజలు మృతి చెందుతుంటే పట్టించుకునే నాథేడే కరువయ్యాడని అన్నారు. ప్రజలు అనారోగ్యాల బారిన పడి అల్లాడుతుంటే ప్రభుత్వం మాత్రం రానున్న ఎన్నికల్లో ఎలా గెలవాలో ఆలోచన చేస్తుందన్నారు. ప్రభుత్వ వైద్యంపై నమ్మకంలేక ప్రజలు ప్రైవేట్ వైద్యాన్ని ఆశ్రయిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా ప్రజల ప్రాణాల మీద దృష్టిని పెట్టాలని కోరారు. ఈ సమావేశంలో నాయకులు దావూద్, రాజేష్, దేవయ్య, సత్యం, చంద్ర శేఖర్, సంజీవ, పగిడయ్య ఉన్నారు.

పోరాటాలు కొనసాగించండి!

● మావోయిస్టు పేరుతో వెలువడిన కరపత్రం



మావోయిస్టుల పేరుతో వెలసిన కరపత్రం

వాజేడు: మండల పరిధిలోని జగన్నాథపురం జంక్షన్‌లో మంగళవారం తెలంగాణ రాష్ట్ర కమిటీ సీపీ మావోయిస్టు పేరుతో కరపత్రం వెలిసింది. తెలంగాణాలో ధరణి పోర్టల్‌తో ద్వారా భూ సమస్యతో రైతాంగం దివాళ తీసిందని, గ్రామీణ ప్రాంతల్లో వ్యవసాయ విప్లవం జరుగకుండా రైతాంగం బయట పడటం సాధ్యం కాదని అందులో ఉంది. గ్రామీణ ప్రాంతంలో ఆదిపత్యం చలయిస్తున్న ముఠాను దెబ్బ తీయకుంటే ముందుకు తీసుకెళ్లడం సాధ్యం కాదని ఉంది. పోలీసుల సహకారంతో పాత, కొత్త భూ స్వాములు, కాంట్రాక్టర్లు, గ్రామ పరిపాలనా అధికారులు, గూండాలు ఒక వ్యవస్థగా మారి ప్రజలను అన్ని రకాలుగా పీడిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు. ఈ దోపిడీ మూఠా గ్రామీణ ప్రాంతల్లో సామ్రాజ్య వాదుల, దళారీ నిరంకుశ బడా బూర్జువా భూస్వాములను కాపాడటంతో ప్రజలను అణచి వేస్తుందని కరపత్రంలో రాశారు. ఈ ముఠాను దెబ్బ తీసి గ్రామాల్లో రైతాంగ అధికారాన్ని నిలబెట్టడానికి వర్గ పోరాటాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి



నగదు అందజేస్తున్న వీరునాయక్, సురేందర్

ఏటూరునాగారం: విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని కెనరాబ్యాంక్ మేనేజర్ వీరునాయక్ అన్నారు. మంగళవారం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో చదువుకుంటున్న ఎస్సీ, ఎస్టీ ప్రతిభ గల విద్యార్థులకు మండల కేంద్రంలోని కెనరా బ్యాంక్ శాఖ ద్వారా మేనేజర్ వీరునాయక్, ఎంఈఓ సురేందర్‌లు కలిసి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా మేనేజర్ మాట్లాడుతూ.. పేద విద్యార్థులను ప్రోత్సహించేందుకు కెనరా బ్యాంక్ విద్యాజ్యోతి స్కాలరిషిప్ పథకం ద్వారా 6,7 తరగతులకు చెందిన విద్యార్థులకు రూ.2500లు ఒక్కొక్కరికీ అందజేశామన్నారు. అలాగే 8 నుంచి 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు రూ. 5వేల చొప్పున ఒక్కొక్కరికి అందజేశామన్నారు. ఇలాంటి పథకాలు ఆర్థికంగా వెనుబడిన విద్యార్థులకు చేయూతనిస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు సంధ్యారాణి, రచన, సమ్మక్క, నీలిమ, అశ్విని పాల్గొన్నారు.

తెలుగు భాషా దినోత్సవం



రామమూర్తి చిత్రపటానికి పూలమాలవేస్తున్న ఉపాధ్యాయ బృందం

వెంకటాపురం(ఎం): మండలంలోని నర్సాపూర్ ఉన్నత పాఠశాలలో తెలుగు భాషా దినోత్సవ వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాడు ఠాకూర్ మంజుల ఆధ్వర్యంలో గిడుగు రామమూర్తి జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మధుసూదన్, జగదీష్, కవిత, సులోచన పాల్గొన్నారు.

కుక్కల దాడిలో గొర్రెపిల్లల మృతి



మృతి చెందిన గొర్రె పిల్లలు

వెంకటాపురం(కె): కుక్కల దాడిలో గొర్రె పిల్లలు మృతి చెందిన సంఘటన మండల పరిధిలోని ఉప్పేడు గొల్లగూడెం గ్రామంలో మంగళవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఉప్పేడు గొల్లగూడెం గ్రామానికి చెందిన జాగర గట్టయ్య అతడి ఇంటి ఆవరణలో గొర్రెల కోసం ఏర్పాటు చేసిన దొడ్డిలో 9 గొర్రెపిల్లలను ఉంచాడని తెలిపారు. కాగా సాయంత్రం గొర్రెపిల్లలపై కుక్కలు దాడి చేయటంతో గొర్రెపిల్లలు మృతి చెందినట్లు తెలిపారు.